
# భేదం



రుద్రా మంగతాయారు

"సరళా!" గర్జించారు రామయ్యగారు

"అదికాదు నాన్నగారూ!"

"నీ సొద నాకనవసరం. నీ నిర్ణయం మార్చుకున్నావా? లేదా!"

"మన్నించండి నాన్నా"

"ఛీ! నా కడుపున చెడబుట్టావే! పాపిష్టిదానా! నీ ముఖం నాకు చూపించకు! ఇక్కడినుంచి పో" అంటూ అరిచారు


"నాన్నగారూ! మీరేనా యిలా మాట్లాడేది? కుల, మత, వర్గ వేదాలు లేవని—ఎంతో గంభీరంగా సభల్లో వేదిక లెక్కి మాట్లాడిన మీరు యిలా అంటారనుకోలేదు "చదువు — సంస్కారం వున్న యువతీ యువకులు ముందుకు రావాలి, ఛాదస్తపు సాంప్రదాయాల్ని వెనక్కు నెట్టాలి, ఆదర్శ వివాహాలు చేసుకోవాలి, కుల, మత, భేదాలు రూపుమాపాలి" — అని మీరంటుంటే మీ ఉన్నతభావాలకు ఎంత మురిసిపోయేదాన్ని! కాని..."

"ఇంక కట్టిపెట్టు — నీ కబుర్లు వినే ఓపిక నాకులేదు. నీ ఇష్టమొచ్చినట్టు అఘోరించు ఈ రోజుతో నా కూతురు చచ్చిందనుకుంటాను" రామయ్యగారు భారంగా తూర్చుని కళ్ళుతుడుచుకున్నారు

సరళ నిశ్శబ్దంగా నిలబడిపోయింది

కోపాన్ని దిగమ్రింగి తగ్గుస్వరంతో రామయ్యగారే మళ్ళీ యిలా అన్నారు

"అమ్మా! సరళా! గొంతెత్తి అరుస్తూ, బల్లగుద్ది చెప్పే ఆదర్శాలన్నీ ఆచరణలో పెట్టలేమమ్మా మనలాంటి వాళ్ళను "స్టేజీ" మీద నాలుగు ముక్కలు చెప్పమంటే— యిలాంటి వెన్నో చెబుతూంటాం. కాని అవన్నీ మనం




చేస్తామా? ఇలా చెప్పటానికి అర్హత సంపాదించామంటే—మన పేరు, పరువు ప్రతిష్ఠలు, మన తాత ముత్తాతలు చేసిన గౌరవమయిన పనులు, ముఖ్యంగా మన డబ్బు...కారణం తెల్లారిలేస్తే ఊళ్ళో వాళ్ళందరికి మంచి — చెడ్డలు చెప్ప వలసిన వాళ్ళం — అలాంటిది మనమే యిలా చేస్తే "ఫలానావారి అమ్మాయి కులం తక్కువవాడితో... నేను భరించ లేనమ్మా" అంటూ కళ్ళు తుడుచు కున్నారు

సరళ కొన్ని క్షణాలు నిశ్శబ్దంనుంచి తేరుకుని —

"నాన్నగారూ! మీరు నమ్మిన సాంప్రదాయాలకు మీరెంత విలువ యిస్తున్నారో, నేను నమ్మిన ఆదర్శాలకు నేనూ అంత విలువ యిస్తున్నాను ఒకరికి మనసిచ్చి మరొకరితో ... నా వ్యక్తిత్వాన్ని "హత్య" చేయలేను నాకు ఆ 'బలహీనత" లేదు అందుకే నా నిర్ణయం మారదు" చరాచరా వెళ్ళి పోయింది సరళ

నౌకరు మల్లిగాడికిమాత్రం అయ్య గారి అవస్థ చూస్తే జాలివేసింది కోపం కూడా వచ్చింది "పిల్ల మనసుపడింది నాలుగు అచ్చింతలు పడెయ్యకూడదా! కులం అంటారేటి! మనుషులు అంతా ఒకేలాగ పుడతారు గందా? మొన్న గుళ్లో సాములోరు కూడా యీ మాటే సెప్పారు గొప్పోళ్ళలోనూ, పేదోళ్ళ లోనూ రకతమే గదా వుంది ఆళ్ళు, యీళ్ళు కూడా తినేది కూడే! కాకపోతే ఆళ్ళు డబ్బుండి ధనవంతులయ్యారు యీళ్ళు డబ్బులేక పేదోళ్ళయ్యారు భగవంతుడికి అన్నీ తెల్సంటారు — మరి తేడా లెందుకెట్టాడు? అందరిని

సమానంగా సూత్తాడంటాడు — మరి మా వాంటోళ్ళనిసాకిరీ సెయ్యమంటాడు యిలాంటోళ్ళని సేయించుకోమంటాడేటి, సెప్పుకిందతేళ్ళులాగాప్పోళ్ళ "ఆదారిటీ" లకు మాలాంటోళ్ళం నలిగిపోడం— ఆయనకు యిట్టంకాటోలు, ఏటో యీ "స్రుట్టి" అంతా యిసిత్తరం..."గొణుక్కుంటూ పనిపూర్తిచేసి యిల్లుచేరుకున్నాడు మల్లిగాడు.

* * *

మల్లిగాడు కుక్కిమంచంలో అటూ యిటూ దొర్లుతున్నాడు వాడి బుర్ర నిండా అవే ఆలోచనలు ఏటో అమ్మాయిగారి మొకమే గ్యాపకం వత్తుందాది. అయ్యగారు ఎన్ని సెప్పినా యినుకుండారు కాదు అయ్యగారి కళ్ళంట సీళ్ళొచ్చాయిగాని—అమ్మాయి గారి కళ్ళల్లో ఒక్క నీటి సుక్క నేదు. పైగా తలెత్తుకుని ఎంత తీవిగా ఎల్లిపోనాదు అయినా తల్లొంచు కెల్లటానికి ఆ యమ్మేం తప్పుసేసిందిలే ?"

యింతలో ఏవో అరుపులు, కేకలు వినిపించాయి ... మల్లిగాడి ఆలోచనలు చెదిరిపోయాయి.

అవి గంగన్న కేకలు శ్రద్ధగా ఆలకించాడు

"సరోజా ! మాట్లాడవేం ! ఏదో సరదాపడుతున్నావుగదా అని తాహతు లేకపోయినా యింతవరకూ చదువు చెప్పించాను. మిడి మిడి జ్ఞానం సంపాదించి 'ప్రేమ-గీమ" అంటూ ఎగురుతున్నావు కులం కానోడిని పెళ్ళిచేసుకోవటం మన యింటా వంటా లేదు చదవేస్తే వున్నమతి పోయిందట వీధి గుమ్మం దాటావా కాళ్ళు విరగేస్తా ! నీ ముందు ముగ్గురాడపిల్లల పెళ్ళిచేసాను పిల్లలంటే సుగుణాల రాశులు అని పేరు తెచ్చుకున్నారు ఈనాటికి నువ్వు బయలుదేరి యీ ఘనకార్యం వెలగబెడుతున్నావు ఎవరి గురించన్నా ఏమైనా చెప్పుకుంటూంటే — "మా అమ్మాయిలు అలా వీధి ముఖం మాడరోయ్" అని ఎంతో గొప్పగా చెప్పుకునే వాడిని..." పట్.. ఫట్ శబ్దం.

"పాపం సరోజమ్మను కొడుతున్నాడనుకుంట. యీ తలిదండ్రులికి ఆళ్ళ పిల్లలు ఎవరినో పేవించి సెడిపోతన్నారనిగాదు బాద — యీదిలో యీళ్ళ పరువులు పోతాయని అనలేదుపు. కన్నబిడ్డల 'సుంకం' కంటే 'గొప్పలే ముక్కెం అనుకుంటా !? యీ గంగన్న డబ్బులేకపోయినా పరువుతో బతుకుతున్నాడు. రేపటినుండి ఎలా బతుకుతాడో ఏటో !

* * *

రామయ్యగారి యింటిలో పెళ్ళి హడావిడి. 'సరళ అభ్యుదయ వివాహం' చూడటానికి దేశం నాలుగు మూలలనుంచి జనం వచ్చారు. వాళ్లంతా డబ్బున్న బాబులు. వచ్చేవాళ్ళు వస్తున్నారు తినేవాళ్ళు తింటున్నారు. తిన్న

వాళ్ళు తీరిగ్గా కబుర్లు చెప్పుకుంటు న్నారు, కాసేపటికి అందరి భోజనాలు పూర్తయ్యాయి

అంతా హాల్లో కూర్చున్నారు

మంత్రిగారు లేచి గొంతు సవరించు కుని మొదలుపెట్టారు – "ఆదర్శాలు, అభ్యుదయాలు ... అంటూ అరవటమే గాని కార్యరూపంలో చూపించేవారు బహుతక్కువ రామయ్యగారు తమ కుమార్తెకు ఆదర్శవివాహంచేసి "కార్య



ఖూరుడు" అనిపించుకున్నారు. రామయ్యగారిలాంటివారు నూటికి పది మందివున్నా మనదేశంలో కుల, మత భేదాలు నామరూపాలులేకుండా పోయేవి కాని ఎవరికి వారే వెనుతీస్తున్నారు అలా కాక రామయ్యగారిలా పిల్లల్ని ప్రోత్సహించి వాళ్ళకు వెన్నెముకల్లా వుండాలని మిమ్మల్ని కోరుతున్నాను. ఎంతో పేదవాడు, తనకంటే ఎంతో తక్కువ కులంవాడు అయిన చంద్రాన్ని ఎన్నుకోవటంలో మన సరళ ఉన్నత భావాలు అర్థమవుతున్నాయి ఈ తండ్రీ కూతుళ్ళ ఆదర్శభావాలకు నేనెంతో సంతోషిస్తున్నా" అంటూ ముగించారు

ఆయన తర్వాత రామయ్యగారి ఆదర్శభావాల గురించి చాలామంది మాట్లాడారు

* * *

నూతిలోంచి గంగన్న శవం తీసారు.

"కూతురు తక్కువ కులంవాడితో లేచిపోయింది అది భరించలేక..."

"పరువే ప్రాణంగా చూసుకొనేవాడికి పరువుపోయాక ప్రాణం ఎందుకు?..."

"అయ్యో! రామా! ఎంత పొగరు? తండ్రిమాట కాదని అలా లేచి పోవటం..."

విందునుండి వచ్చిన మల్లిగాడి ప్రాణం నీరయిపోయింది

వాడి బుర్రనిండా ఆలోచనలే...

"లోకం కాకుల్లా పొడుస్తారని వీరికి గంగన్న ఎంతపనిచేసాడు! డబ్బు లేనోడు గాబట్టి "ధైర్యం" నేక సచ్చాడు కాని రామయ్యగారు తెలివయినోడు ముక్క్యంగా డబ్బునోడు గాబట్టే - దాన్నే "ఆదరసం"గా మార్చిసి కూతురు పెళ్ళిసేసినాడు యిక కూతురు తన మాట యినదని తెలిసి ప్లేటు పిరాయిం చేసినాడు నలుగురితోటి సెబాసని పించుకున్నాడు సరళమ్మ సేసిన పనే సరోజమ్మా సేసింది కాని సరళమ్మది "ఆదరస యివాహం" అన్నారు. సరోజమ్మ లేచిపోయిందన్నారు. యీళ్ళిద్దరికి "భేదం" ఏటో మరి! "స్రుష్టి" యిసిత్రంగా వుందే!!"

